కాళిదాసుని కళాప్రతిభలు

కోరాడ రామకృష్ణయ్య ఎం. ఏ.

తిరువళిక్కేణి, మద్రాసు-5

'కోరాడ' వారి కొన్ని ప్రముఖ రచనలు

కాళిదాసుని కళాప్రతిభలు

(ప్రథమ ముద్రణము - 1930)

తొలిపలుకు

సాహిత్య విమర్శనము విషయమున మన ప్రాచీనులవలంబించిన పద్ధతులకును నాధునిక పద్ధతులకును గొంత భేదము లేకపోలేదు. ఆయాకావ్యములు తల్లక్షణలక్షితములై యుండుటను గూర్చియు నెందలి రీతిరసగుణాలంకార విశేషములను గూర్చియు బరిశీలించి విమర్శించుటయే ప్రధాన కర్తవ్యముగా మన దేశమందలి సాహిత్యవిమర్శకు లెంచియుండిరి. వారొక కవియొక్క పాండితీప్రభావమును, బుద్ధి బలమును కొలతవేయ జూచిరేగాని, ఆతని కవితలో బ్రతిబింబించు నాతని హృదయావేశమును, ఆవేగమును, ఆవేదనను కనిపెట్టి, యాతని జీవితచరిత్రకును దేశకాలస్థితులకును కవితారీతులకును గల సంబంధమును సమన్వయించి దేశకాల పరిస్థితులనుబట్టి యాతని కళా ప్రతిభ లెట్టి పరిణతినిబొందినవో, యాతని సహజశక్తి ప్రత్యేకవ్యక్తిత్వము (individual personality) యెట్లచ్చట గానవచ్చుచున్నదో పరిశీలించి వ్యక్తముచేయుటయం దంత విశేషాదరమును జూపినట్లగపడదు మన దేశమునందలి సాహిత్యవిమర్శన మీ చారిత్రక పద్ధతులను (Historical methods) గూడ ననుసరించి నడుపవలసిన యావశ్యకత యెంతేనియు గలదు.

హైందవ నాటక ప్రపంచమున గాళిదాసునివలెనే పాశ్చాత్య నాటక ప్రపంచమున విశేషప్రఖ్యాతి గాంచియున్న షేక్స్పియర్ మహాకవినిగూర్చియు, నాతని నాటక చక్రమునుగూర్చియు ననేకు లనేకవిధములగు నత్యద్భుత విమర్శనములను జేసియున్నారు. డౌడన్ (Dowden)అను నాంగ్లేయ సాహిత్యవిమర్శకుడు ''షేక్స్పియర్ కళా ప్రతిభలు'' (Shakespeare's mind and art) అను గ్రంథమున నాతని నాటకములను గూర్చి చేసిన విమర్శనరీతియే, కాళిదాసుని నాటకములను గూర్చి యీవిమర్శనమును వ్రాయ నన్ను ప్రేరేపించినది.

సహృదయ విధేయుడు,
కోరాడ రామకృష్ణయ్య.

ఆలంకారికులు కావ్యములను దృశ్యకావ్యము లనియు శ్రవ్యకావ్యము లనియు రెండు భాగములుగ విభజింతురు. అందు శ్రవ్యకావ్యములు కేవల శ్రవణయోగ్యములు, గద్యప ద్యోభయమయంబులు నగు మహాప్రబంధ క్షుద్రప్రబంధా దులు. నాట్యప్రధానములు, ప్రదర్శనయోగ్యములు నగునవి దృశ్యకావ్యములు. దృశ్యమైనను, శ్రవ్యమైనను గవితకు బరమ ప్రయోజన మానందమనియు, ముఖ్యాధారము మానవ జీవితంబనియు జెప్పవలసియున్నది. అనవరత మనేక విధముల బరిణామమును బొందుచున్న మానవజీవితము భాషామూలమున మన కనులయెదుట బెట్టబడుచున్నది గనుకనే యే కాలమందైనను కవిత మానవున కంత యాదరపాత్రమగుచున్నది. మానవజీవితమును భాషామూల మున బ్రతిపాదించు సందర్భమున నొకకవి స్వీయాశయము లను ఆత్మీయానుభవములను నొక కావ్యమున బొందుపరప వచ్చును. లేదా లోకవృత్తమును యథాస్థితంబుగ వర్ణించి వాఙ్మయాదర్శంబున బ్రకృతిని బ్రతిబింబింప జేసి మానవజీవి తమందలి పరమ రహస్యములను బ్రకటింప వచ్చును. ఇట్లు కవి తన భావములను స్వయముగా జదువరులకు దెలుప

గడంగినచో నట్టి కవితను (Subjective Poetry) ఆత్మానుభవప్రతిపాదకమగు కవితయనియు, కవిత యందాతడు మఱుగువడియుండి ప్రపంచరూపం బగు నాట్యరంగమున మానవరూపధారులగు నటులచేతనే లోక వృ ను బ్రదర్శింప జేయుచుండినచో, నట్టి కవితను (O ective Poetry) బాహ్యవృత్త ప్రతిపాదకమగు కవిత యనియు రీతిని సాహిత్యవిమర్శకులు కవితావిభాగ మొనర్తురు. నాటక కవిత్వము ముఖ్యముగా నీ రెండవజాతి కవితలో జేరును. అనగా నిట్టి కవితయందు కవి మన యెదుట బడుటకు గాని, యాతడు తన భావములను స్వయముగా బయలుపఱుచుటకు గాని యెట్టి యవకాశమును లేదనుట. హైందవనాటకములందు నటీసూత్రధారాదుల సంభాషణరూపంబగు ప్రస్తావనామూలమున కవి నామగుణశీల ప్రతిభాదులైనను దెలుపబడుచుండ, నాంగ్లేయ నాటకాదుల నదియు సామాన్యముగ గానరాదు. షేక్స్పియర్ మహాకవి ప్రతిభను గాని, యాతని నాటకరచనా పద్ధతులను గాని యెఱుగక, యొక నాటకమును దీసికొని స్థూలదృష్టితో జదివినంత మాత్రమున నది యాతని దని నిశ్చయించి చెప్పుట సుసాధ్యము గాదు. అయినను సృష్టి స్థితి లయకారకుడగు పరబ్రహ్మ ''తత్ సృష్ట్వా తదేవానుప్రావిశత్'' అను శ్రుతి జెప్పుచున్నట్లు జగత్తును సృజించి దానియందు లీనమైనట్లే కవిబ్రహ్మయు దాను జేసిన కావ్య సృష్టియం దంతర్లీనుడై యుండకపోడు. ప్రకృతి పరిశోధనము సల్పినకొలది యా పరమాత్ముని మహిమాతిశయము బయలుపడుచుండునట్లే కవితను బరిశోధించినకొలది కవీశ్వరుని ప్రతిభావిశేషమే కాక యాతని మనస్తత్వముగూడ బయలుపడుచుండును. ఏల యనగా: సామాన్యముగ దేశ కాల పరిస్థితు లాయాకాలము లందలి కవితయందు బ్రతిబింబింపక మానవు. ఈ కారణముచేతనే కొంతవఱకైనను ప్రాచీనకవుల కాలనిర్ణయమును జేయ గలుగుచున్నారము. ఒకవేళ యసమానప్రతిభావంతుడగు కవి యొక డీ దేశకాల పరిస్థితులను గూడ నతిక్రమింపగలిగినను ఆత్మగుణముల నతిక్రమింపలేడు గదా! కావున స్వాభిప్రాయ ప్రకటనమున కావంతయు వీలులేని నాటక కవితయందును దత్కథా సూత్రము నాడించుచు దాని నంత నావరించియుండు నా యాంతరశక్తిని మనము సూక్ష్మదృష్టితో బరిశీలించినచో గుర్తింపలేకపోము. ఆ కవి రచించిన యితర గ్రంథములను గూడ నిట్లు పరిశీలించినచో నాతని కవితా ప్రభావ పరిణామమును లోకానుభవపరిపాకమునే కాక తత్కావ్యకళాభివృద్ధికి మనస్తత్వమునకు జీవిత చరిత్రమునకును గల పరస్పర సంబంధమును గూడ మనము దెలిసికొని సమన్వయింపగలుగుదుము. పాశ్చాత్య విమర్శకాగ్రేసరు లనేకులు షేక్స్పియర్ మహాకవి నాటకచక్రము నట్లు పరిశోధించియుండుట చేతనే యాతని నాటక కళాభివృద్ధి యందలి యంతరావస్థలను, తత్కళాపరిణామమునకు నాతని జీవితమునకు గల సంబంధము నీ మొదలగు ననేకాపూర్వాంశములను గనిపెట్టి యున్నారు.

ఇట్టి విమర్శనపూర్వకమగు గ్రంథాధ్యయనము మన దేశమున గొంతవఱకు దక్కువనియే చెప్పవలసియున్నది. అనగా గవితావిమర్శనమే యీ దేశమున లేదని చెప్పుట కాదు. కాని యొకగ్రంథమును విమర్శించునప్పు డందలి విషయము లాలంకారికనియమముల ననుసరించి యున్నవా! కవి గ్రంథాదినియమములను పాటించెనా! సూచ్యార్థసూచన గలదా! పాకశయ్యాలంకారకల్పనా చమత్కృతు లేమైన గవి జూపినాడా? వ్యాకరణదోషము లేమైన నున్నవా? రసపోషణము సమంజసమా? అను నీ మొదలగు విషయముల జర్చించి యా గ్రంథమున కింతవఱకు బ్రాచీన కవితా లక్షణములు పట్టుచున్నవని మాత్రము చూపుటకలదు. గ్రంథములను విమర్శించుటలో నిదియు నొకవిధము మాత్రమే యైయున్నది. దీనివలన గ్రంథవిమర్శన విషయమున వీరి దృష్టిలో కేవల గ్రంథమునకు గల ముఖ్యము గ్రంథకర్త విషయమున నేమాత్ర మున్నట్లగ డదు. కవి యెవడైన నేమి; యే కాలమువాడైన నేమి; యాతని బుద్ధివైభవమెట్టిదైన నేమి; యెట్టి పరిణామముల బొందిన నేమి; యాతని జీవిత చరిత మెట్టిదైన నేమి? వానితో నీ విమర్శకుల కేమియు నగత్యము లేదు. అతని గ్రంథమునందలి భాష, కల్పన, రసము మొదలగునవియే వీరికి గావలసినది. ఇవి పూర్వ లాక్షణిక మతానుసారముగ నుండెనా కవిగొప్పవాడే; కావ్య ముత్కృష్టమైనదే. లేక, యొక డెట్టి స్వల్పవిషయమునైనను బ్రాతపుంతను వదలి క్రొత్తమార్గమున ద్రొక్కిన నాతనికి లక్షణము దెలియదు. ఆతడు లాక్షణికకవులలో జేర్పదగడు. గ్రంథ ముత్కృష్టమైనదే యైనను లక్షణకవులచే నది పరిగ్రాహ్యము కాదు. పోతనామాత్యుని భాగవతమువంటి గ్రంథ మెంతరసవంతమైనదైనను రేఫశకట రేఫముల ప్రాసమైత్రితో గూడిన కతంబుననే కదా లాక్షణికుల యీనడింపులకు బాత్రము గావలసివచ్చినది.

''బమ్మెరపోతరాజకృత భాగవతంబు
సలక్షణంబుగా
కిమ్మహి నేమిటం గొదువ యెంతయు
వారసి చూడగాను రే
ఫమ్ములు ఱాలునుం గదిసి ప్రాసము
లైన కతంబునం గదా
యిమ్ముల నాదిలాక్షణికు లెల్లరు
మాని రుదాహరింపగన్.''

అని చెప్పుచు నప్పకవియు బూర్వులమార్గమునే యనుసరించెను. కావున గవికి, వానికవితకు నిట్టి లక్షణగ్రంథములు విమర్శనలును బ్రోత్సాహకరము లగుటకు బదులుగా నొకవిధమగు శృంఖలములగుట తటస్థించినది. వీని నతిక్రమించి తన స్వాతంత్ర్యమును వెలయించి యొకడు వ్రాసెనాయాతడు కావ్యరసాస్వాదనిపుణులగు సహృదయులమెప్పువడయ గలిగినను లాక్షణికులవలన బహిష్కారమునే పొందుచున్నాడు. ఇట్లు మహాకవుల కావ్యములను బరిశీలించి విమర్శించుటవలననే బయలు దేఱిన లక్షణము గొంత కాలమునకు దనపుట్టుకను పూర్వోత్తరములను మఱచిపోయి యా కవితనే శాసించి బంధింప గడంగుచున్నది.

విమర్శనమనునది తజ్ జ్ఞుల మదికెక్కిన కవితయందలి విశేషలక్షణముల బరిశీలించి, వానికి గల కారణముల నారసి యాయాదేశకాల పరిస్థితులకును దత్కవితారీతికిని గల సంబంధమును దెలిపి, యా కవీశ్వరుని కవితాశక్తి యిట్టిదనియు, నా కావ్యమందలి యుత్తమగుణము లివ్వియనియు సానుభూతితో నిరూపించుటయ గాని, కొన్ని నిర్దిష్టలక్షణములను, ప్రాక్పరికల్పితపద్ధతులను అనుసరించి యున్నదా? లేదా? యనియు, దక్కిన కావ్యములకంటే నిది గొప్పదా తక్కువదా యనియు విచారించుట మాత్రము గాదు. కవితావిమర్శనమునకు గావ్యమందలి విశేషలక్షణములను గ్రహించుట యెంత యవసరమో యాయాలక్షణములకును దత్కవి మనస్తత్త్వమునకును గల సంబంధము నారసి సమన్వయించుటయు నంత యావశ్యకమే. కావున కవియొక్క దేశకాలపరిస్థితులు, ఆతని మతాభిప్రాయములు, ప్రతిభాశక్తులు మొదలగువాని పరిజ్ఞానము ఆతని కవితాపద్ధతులను దెలిసికొనుటలో నత్యంత సహకారి యగుననుటలో సందేహము లేదు. ఇంతేకాక చరిత్రము తెలియని కవుల జీవిత విషయములను, మనస్తత్త్వమును గూడ గొంతవఱకు వారి గ్రంథములను బరిశీలించుటచే దెలిసికొనుట కవకాశము కూడ కలుగుచున్నది.

ఒక కవీశ్వరుని మనస్తత్త్వమును, కావ్యకళాపరిణామమును గనిపెట్టుట కాతనిగ్రంథముల పౌర్వాపర్యజ్ఞాన మావశ్యకము. ఇట్టి జ్ఞానముతో గూడిన కవితాపరిశీలనమును సానుపూర్వియగు నధ్యయనవిధానము (Chronological Method of Study of Literature) అని యందురు. ఒక కవిచే రచింపబడిన గ్రంథముల నొకదానితో నొకటి బోల్చి చదివి విమర్శించుటచే దత్కవిత్వసారము గ్రహింపబడుచున్నది. ఈ కవిని, వీనికృతులను అంతకు బూర్వులును సమకాలికులు నగు కవులతోడను వారి కృతులతోడను సరిపోల్చిచూచి యాయా కవులకు గృతులకు గలసంబంధమును, పోలికలను, భేదములను విమర్శించుచో నట్టి దానిని తారతమ్య పరిశీలనముతో గూడిన యధ్యయనవిధానము (Comparative Method of Study of Literature) అని యందురు. పౌర్వాపర్యవిచక్షణము లేక యేకవి గ్రంథముల నైనను బ్రత్యేకముగ జదివినప్పుడు దానివలన గలుగు నానందము నంతను బొందగలిగితి మనుటకు వీలులేదు. కవియొక్క భావగాంభీర్యమును సరిగ గొలిచి చూచితి మనలేము. ఆతని కావ్యకళ యేయేమార్గముల వృద్ధినొందినదో, ఆతనికి గాలక్రమమున గలిగిన లోకానుభవ మెట్టిదో, అద్దాని నాత డెట్లుపయోగపఱచుకొనెనో, దాని మూలమున నాతని మనస్తత్త్వమున గలిగిన మార్పు లెట్టివో అను విషయములను గనిపెట్టుట కవకాశముండదు. పారమార్థికచింతాతత్పరులగు మన పూర్వకవులు తమ యైహికచరిత్రను దెలుపువిషయమున విశేషశ్రద్ధ వహించినవారు గాకుండుటచే వారి గ్రంథముల బౌర్వాపర్యముమాట యటుండ నయ్యవి యాయాకవులు రచించినవియే యని నిరూపించుట గూడ నొక్కొక్కప్పుడు కష్టమగుచున్నది. కవుల కాలనిర్ణయ విషయముననే యనేకములగు చిక్కులు, అభిప్రాయభేదములు గలుగుచున్నపుడు ఒక కవిని, వాని గ్రంథములను, వానికి సమకాలికులు, పూర్వులునగు కవులతోడను, వారికృతులతోడను బోల్చి విమర్శించి యాకవియొక్క విశేషగుణములు, ప్రతిభాశక్తి యిట్టివని కనుగొనుట మఱింత కష్టమగుచున్నది. స్థలకాలములు తెలిసిన సుప్రసిద్ధాంగ్ల కవీశ్వరుడగు షేక్స్పియరు విషయముననే నిశ్చయముగ నాటకముల రచించినవాడాత డగునా కాదా యను సందేహమును, దన్మూలకములగు వాదోపవాదములును బయలుదేఱియున్నపుడు స్థలకాల విషయముననే సందేహముతో గూడిన కాళిదాసాది ప్రాచీన దేశీయకవుల విషయము చెప్పెడిదేమి? అయినను షేక్స్పియర్ వలెనే జీవితచరిత మంతనిశ్చయముగా దెలియని హైందవనాటకకర్తయగు కాళిదాసుని కళాప్రతిభలనుగూర్చి తెలిసికొనవలెనన్నచో నాతనిగ్రంథములను బరిశీలించుటయే ముఖ్యమగు మార్గముగా దలంపదగియున్నది.

కాళిదాసుని నాటక కళాచాతుర్యమును, దానిపరిణామమునుగూర్చి తెలిసికొనుట కాతనినాటకములే మనకు ముఖ్యమైన యాధారము లగుచున్నవి. కాళిదాస విరచితము లని ప్రఖ్యాతిజెందిన నాటకములు మూడు గలవు. అందు విశేషప్రసిద్ధి గాంచినది నాటకరాజం బనదగిన యభిజ్ఞానశాకుంతలము. ఇందలి కథ మహాభారత పద్మపురాణముల బ్రసిద్ధమైన కథలలో నొకటి. నీరసములగు చారిత్రక పౌరాణిక కథ లనేకములు షేక్స్పియర్ మహాకవి భావనాశక్తిచే మెఱుగు పెట్టబడి యెట్లు నూతన శోభ కలవయ్యెనో యట్లే దుష్యంతుని పురాణకథయు గాళిదాసుని యసమానంబగు

ప్రతిభావిశేషముచే నూతన జీవనమును బడసి ఖండాంతర పండితప్రకాండులనుగూడ దాండవమాడించినది. కాళిదా సుని యీ నాటకముల జదివినందువలన గలిగిన యానందపా రవశ్యముచే జ నీదేశపు పండితుడగు 'గెటె' యనునాతడు దీనినిగూర్చి చె ్న ప్రశంసావాక్యములు పలువురకు దెలిసిన వేయైనను మ యొకమాఱు వాని నిచ్చట స్మరించుట యతిప్రసంగము కాదు.

"Wouldst thou, the young years blossom
 and the fruits of its decline,
And all by which the soul is charmed,
 enraptured, feasted, fed,
Wouldst thou, the earth and heaven itself in
 one sole name combine,
I name thee, O Sakuntala
 and all at once is said."

ఉపదేశైకప్రయోజనంబగు నీ వ్యాసుని పురాణ కథ హిందూజనుల కత్యంత మాదరపాత్రంబగు నని యెంచి గ్రహించి రసైకప్రవణంబులగు నాటకపరిస్థితుల కనుగుణం బున మార్పులొనర్చి కథాప్రవృత్తి విషయమునను, స్వభావ పరిపోషణ విషయమునను, రసనిర్వహణమార్గమునను దన యప్రతిమానచాతుర్యమును బ్రకటించి కాళిదాసు దీనిని హైందవ నాటకముల కాదర్శముగ జేసి భారతీయనాటక కళకు వన్నె పెట్టినవాడయ్యెను. ఇట్లే బుగ్వేదమునను, బురాణములందును మూలబడి కళదక్కియున్న విక్రముని కథనుగూడ బయటికి దీసి జీవముపోసి తన భావనాపటిమచే మెఱుగుపెట్టి శోభాయమానమగునట్లు చేసెను. శాకుంతలమం దువలె దీనియం దీతని నాటకకళ పరిపూర్ణవికాసావస్థను బొందినట్లు కనబడదు. ఈ రెంటియందును భాసిల్లుచుం డెడి భావసౌకుమార్యము, రీతిమాధుర్యము, కల్పనా పటిమ, మొదలగు నుత్తమగుణములు కొన్ని మాళవికాగ్ని మి। మున గనుపడకపోవుట చేతను దీనియందలి కథ కవి క ౹తమై సర్వజనీనంబగు ననుభవసంతానంబును (Universal perience), మున్నతమగు ధర్మవృత్తమును (High Morality) జూపునది గాకుండుటచేతను నిది యీ కాళిదాసవిరచితమే కాదని కొందఱు పండితు లభిప్రాయ పడియున్నారు. కాని, యిది కాళిదాసుని తొలిరచనలలోని దగుటచేతనే పరిపక్వం బైన యాతని ప్రతిభకును లోకానుభవోద్దీపితంబగు బుద్ధివిశే షంబునకును నిదర్శనంబగు శాకుంతలముతో దులదూగలేకుం డెనని తలంపవలసియున్నది. ఇందలి భావములేకాక పదగుం భనలు గూడ దక్కిన రెండునాటకములలో సమాన సందర్భముల గన్పడుటచే నీ మూడునుగూడ నొకనిచేతనే రచింపబడినవని యీ మూడు నాటకములయందలి కథాంశ ములను, భావములను, పదబంధములను సరిపోల్చి చూచిన వారికి స్పష్టము గాకమానదు. మఱియు దొలిరచనయందు కంటె నుత్తరోత్తరములగు నాటకములయం దీతని భావనావి లాసము, భావగాంభీర్యము మిన్నయగుటయే కాక యాతని బుద్ధిపరిపాకము, కళానైపుణ్యము ప్రకటితమగుచున్నవని చెప్ప నొప్పును.

కర్ణాలంకారమగు కిసలయమును గ్రహించిన మాళవిక యొక్క పాదాఘాతమును బడసిన యశోకమును ప్రమదవన మున నొకచో వేచియుండి చూచిన యగ్నిమిత్త్రుడు తన కట్టి యదృష్ట మబ్బలేదుగదా యని ''వయస్య! పశ్య,

శ్లో. ''ఆదాయ కర్ణకిసలయ
 మస్మా దియ మత్ర చరణ మర్పయతి,
 ఉభయో స్సదృశవినిమయా
 దాత్మానం వఞ్చితం మన్యే.''

అని చింతింపందొడగెను. అట్లే కణ్వాశ్రమమున వృక్ష సేచనము చేయుచు జెలికత్తెలతో గూడిన శకున్తలను బాదపాన్తర్హితుండై చూచుచున్న దుష్యంతుడు శకున్తల ముఖము మీద వ్రాలిన తుమ్మెదను జూచి,

శ్లో. ''చలాపాంగం దృష్టిం స్పృశసి బహుశో వేపథుమతీం,
 రహస్యాఖ్యాయీవ స్వనసి మృదు కర్ణాంతికచరః,
 కరౌ వ్యాధున్వన్త్యాః పిబసి రతిసర్వస్వమధరం,
 వయం తత్త్వాన్వేషా న్మధుకర! హతా స్త్వం ఖలు
 కృతీ.''

అని వస్తుతత్త్వాన్వేషణముచే దాను నిరుద్ధప్రవృత్తుడగుచుండ నా తుమ్మెద కృతకృత్యంబగుటను గూర్చి విచారింప దొడగెను. మొదటి పద్యములోని ''ఆత్మానం వంచితం మన్యే'' అనుదానికిని రెండవదానిలోని ''వయం హతాస్త్వం ఖలు కృతీ'' అనుదానికిని గల భావసామ్యము స్పష్టమే. అగ్నిమిత్త్రుని వస్తు వినిమయమును గూర్చిన వర్ణనముకంటె దుష్యంతునిచే శృంగారనాయకుడుగా జేయబడిన మధుకరుని గూర్చిన వర్ణనమే కాళిదాసుని భావనావిలాసమును స్ఫురింపజే యుచున్న దనుటకు సందేహములేదు.

యకుల నేకాంతమున విడువనెంచిన చెలులు హరిణశాబకం బుల నావలకు దోలుమిషచేతనే వారి చెంత నుండి చనుట యీ రెండు నాటకములందును గాననగును.

''విదూషకః- (పరిక్రమ్య ససంభ్రమం) వకుళావళికే! ఏష బాలాశోకవృక్షస్య పల్లవాని లఙ్ఘయతి హరిణః. ఏహి వారయావ ఏనమ్.

వకు–తథా(ప్రస్థితా)-(మాళవికాగ్నిమిత్రమ్)

ప్రియంవదా– (సదృష్టిక్షేపం) అనసూయే! ఇతో దత్త దృష్టిరుత్సుకో మృగపోతకో మాతర మన్విష్యతి. ఏహి! సంయోజయావ ఏనం. (ఇత్యుభే ప్రస్థితే) (శాకుంతలమ్)''

ఇంక నీరెండు నాటకములయందును జెలులతో సంభాషించుచున్న నాయికల పలుకులు వినుచు నామె యెదుటకు జనుటకై తగిన తరుణము నిరీక్షించుచు నాయకులు తీవె పొదలచాటున దాగి యుండుటయు, మాళవికాగ్నిమిత్రమున నిరావతి నిపుణికాద్వితీయయై యగ్నిమిత్రుని రహస్య చర్యలను గనిపెట్టుటకుగా వానిని వెదకుచు నుద్యానవనమున దిరిగినట్లే విక్రమోర్వశీయమున నౌశీనరీదేవి తన పరిచారిక యగు నిపుణికతో జేరి పురూరవుని వెదుకజనుటయు బురూరవాగ్నిమిత్రుల యనురాగశూన్యములగు నాయికోప చారవిధులను గూర్చిన ప్రశంసలును గాననగును.

''అగ్ని– వయస్య, నిసర్గనిపుణాః స్త్రియః. కథం మాం అన్యసంక్రాంతహృదయం ఉపలాలయంత మపి తే సఖీ న లక్షయతి. అతః పశ్యామిః

శ్లో. ''ఉచితః ప్రణయో వరం విహంతుం
బహవః ఖండనహేతవోపి దృష్టాః,
ఉపచారవిధి ర్మనస్వినీనాం
నతు పూర్వాభ్యధికో పి భావశూన్యః.''

పురూ :–
శ్లో. ''ప్రియవచన శతోపి యోషితాం
దయిత జనానునయో రసాదృతే,
ప్రవిశతి హృదయం న తద్విదాం.''

ఈ మొదలగు సమానసందర్భము లనేకము లీ నాటకము లేకకర్తృకములని సాధింపగలవు. ఇంతేకాక:

రాజా– (ఆత్మగతమ్) అహో సర్వాస్వవస్థాసు చారుతా శోభాం పుష్యతి-(మాళవికాగ్నిమిత్రము)

కంచుకీ– (రాజాన మవలోక్య) అహో! సర్వాస్వవస్థాసు రమణీయ మాకృతివిశేషాణామ్-(శాకున్తలమ్)

ఈ మొదలగు వాక్యసరణియు,

నాయికతోడిరహస్యప్రణయము బయలుపడినతోడనే నాయకుడు లోప్త్రహస్తుడగు కుంభీరకునితో బోల్పబడుటయు;

విదూ– (జనాన్తికమ్) ప్రయోజయేదానీం కిమపి కర్మగ్గృహీతేన కుంభీరకేన సంధిచ్ఛేదనే శిక్షితః ఇతి వక్తవ్యమ్ (మాళవికాగ్నమిత్రమ్)

లోప్త్రేణ గృహీతస్య కుంభీలకస్య అస్తివా పరిహారం.
-(విక్రమోర్వశీయమ్)

స్వభావముచే భీరువగు విదూషకునకు గలిగిన సర్పభ్రాంతి;

నిపుణికా– ఇమం భుజఙ్గభీరుకం బ్రహ్మబంధుం అనేన భుజఙ్గకుటిలేన దండకాష్ఠేన స్తంభాంతరితా భూత్వా భీషయామి.

(విదూషకస్యోపరి దండకాష్ఠం పాతయతి)

విదూ– (సహసా ప్రబుధ్య) అవిహా అవిహా భోః, దర్వీకరో మే ఉపరి పతితః...కథం, దండకాష్ఠమేతత్!
-(మాళవికాగ్నిమిత్రమ్)

విదూ– అవిద భోః! కిన్న్వేతత్ భుజఙ్గనిర్మోకః? భూర్జపత్రగతోయ మక్షరవిన్యాసః
-(విక్రమోర్వశీయమ్)

ఈ మొదలగు భావసామ్యములును;
కల విశుద్ధాయాః గీతేః స్వరసంయోగః శ్రూయతే (శాకుం 6);
ఆర్యకౌశిక్యాఇవ స్వరసంయోగః -(మాళ-5
వసంతప్రథమావతార సుభగాని -(మాళ-3)
వసంతోదారసూచకం అభిరామత్వం ప్రమదవనస్య -(విక్ర-3)
మా అత్ర భవతీ ధారిణీ విసంవాదయిష్యతి-(మాళవికా-1)
రమణీయఃఖలు అవధిః విధినా విసంవాదితః -(శా-6)
కిమిదానీం తత్రభవతీ ఊర్వశీ భవతః మనోరథానాం
కుసుమం దర్శయిత్వా ఫలే విసంవదతి -(విక్ర-2)
ఏతావా నేవ మే మతివిభవః -(విక్ర-2)
మృత్పిండ బుద్ధినా మయా -(శాకుం-6)

ఈ మొదలగు ననేకములైన సమానార్థక పదబంధ విశేషములుగూడ నీ నాటకము లేకకర్తృకము లనుటకు మఱింత యుపబలకము లగుచున్నవి. మాళవికాగ్నిమిత్రమున దక్కిన వానియందువలె గాళిదాసుని భావనాశక్తి స్ఫురణయు భావసౌకుమార్యము నంతగా గన్పడకుండినచో నది యాతని నాటకరచనావిషయమున బ్రథమప్రయత్నమగుటచేతనే యైయుండవలయును. కాని యీ కారణముచే నాగ్రంథము కాళిదాస కృతము కాదనుట సమంజసముగ గన్పడదు.

ఈ రూపకములయందలి నాందీ ప్రస్తావనాంశములు గూడ నీ పై వాదమునే బలపఱచుచున్నవని చెప్పదగియున్నవి. వీనియందలి నాందీశ్లోకములన్నియు రఘువంశమందలి యాద్యశ్లోకము వలెనే శివస్తుతిపరము లగుటయేకాక మాళవికాగ్నిమిత్రమున.-

''అష్టాభి ర్యస్య కృత్స్నం జగదపి తనుభి ర్బిభ్రతో నాభిమానః'' అనియు, శాకున్తలమున ''ప్రత్యక్షాభిః ప్రపన్న స్తనుభి రవతు వ స్తాభి రష్టాభి రీశః'' అనియు, నాతని యష్టతనువులనుగూడ బేర్కొనుటచే నీ గ్రంథము లేక కర్తృకములనుట ధ్రువపడుచున్నది. పూర్వరంగాంగ భూత మగు నాంది యిష్టదేవతాస్మరణపూర్వకమును, ఆశీర్వచనా త్మకమునగు శ్లోకరూపమున నాటక కర్తయే రచించు నాచారము కాళిదాసుని కాలమునుండియే బయలు దేఱి యుండవలయునని తలంపదగియున్నది. ఏలయన, నంతకు బూర్వకాలమున రచింపబడినవిగా దలంపబడుచుండిన భాసుని నాటకములో ''నాంద్యంతే తతః ప్రవిశతి సూత్ర ధారః'' అని మొట్టమొదటనే కనబడుచుండుటచే రంగప్రసా ధనము, నాంది మొదలగు పూర్వరంగాంగము లన్నియు ముగిసినపిమ్మటనే సూత్రధారుడు లేక సూత్రధారగుణాకృ తులుగల స్థాపకనామకుడు ప్రవేశించి నాటక వస్తువును, పాత్రప్రవేశమును సూచించి నిష్క్రమించుట యాచారముగ నున్నట్లూహింపదగియున్నది. ఇట్టి భాసుని కాలమునాటి యాచారము కాళిదాసుని కాలమున గొంత మార్పు చెందుటచే గాబోలు కాళిదాసునికి దరువాతి వాడగు బాణుడు భాసనాటకముల కిదియొక విపరీతలక్షణ మైనట్లుగా,-

''శ్లో. సూత్రధారకృతారంభై: నాటకై ర్బహుభూమికైః,
సపతాకై ర్యశో లేభే భాసో దైవకులై రివ.''

''నాందీ శ్లోకము లేకుండగ, సూత్రధారుని చేత ప్రారంభము చేయబడిన నాటకములచేత భాసుడు ప్రఖ్యాతిగాంచెను'' అని చెప్పియున్నాడు. వీనియందు వస్తుసూచనము గూడ సామా ముగ నాయానాటకములయందలి ప్రధాన పాత్రల నామ ముతో గూడిన యొక మంగళశ్లోక మూలముగ జేయబ యుండెనేకాని నాటకముయొక్కయు దత్కర్తయొ క్కయు బ్రశంస యేమాత్రము గానరాదు. మొదటి నాందీశ్లోకము నాటక కర్త రచించు నాచారము కాళిదాసుని కాలముననే బయలుదేరి యుండవచ్చును. ఒకవేళ కాళిదాసు తనకు బరమదైవతంబగు ప్రకృతితో గూడిన పరమపురుషుని వర్ణింపదలచి తన గ్రంథముల మొదట నీశ్లోకములను రచించుటచే నిదియే యొక యాచారమై తరువాతి కవులచే నవలంబింపబడినదేమో! భాసుని నాటకము లన్నియు బ్రాయికముగా రాజాజ్ఞచే దదాస్థానమునం బ్రయోగించుట కుగా రచియింపబడియుండుటచే గాబోలు కవి యానాటక ములందు స్వీయనామనిర్దేశాదికమునకు గడంగక మంగళశ్లోక పఠనానన్తరమే పాత్రప్రవేశమును సూచింపుచు స్థాపనమును ముగింపజొచ్చెను. సూత్రధారుడు మంగళశ్లోకమును జదివి ''ఏవ మార్యమిశ్రా న్విజ్ఞాపయామి'' అని యేదో విజ్ఞాపన చేయబోగా నేపథ్యమునుండి యొకశబ్దము వినవచ్చుటయు నాతడు:

''అయే కిన్ను ఖలు మయి విజ్ఞాపనవ్యగ్రే శబ్ద ఇవ శ్రూయతే; అంగ, పశ్యామి; (నేపథ్యే) ఉస్సరహ ఉస్సరహ, అయ్యా! ఉస్సరహ.

''సూత్రధారః-భవతు. విజ్ఞాతం'' అని నాటకపాత్ర ప్రవేశమును సూచించి నిష్క్రమించుటయు నీ నాటకములో (వాసవదత్తా పంచరాత్రము మొదలగు నెనిమిదింటిలో) గానవచ్చుచున్నది. తక్కిన వానిలో నటీసూత్రధార సంభాష ణము (ప్రతిమానాటకమున శరదృతుగానము) కొంత యున్నను, అది నాటకమునుగూర్చిగాని తత్కర్తను గూర్చి గాని ప్రశంసించునదిగా గన్పడదు. ఈ నాటకములు రాజాస్థానముననే ప్రయోగింపబడియుండ వలయు ననుటకు వీనిలో బెక్కింటియందు భరతవాక్యములో రాజసింహుని ప్రశస్తి గానవచ్చుచుండుటయే ప్రబలకారణముగ గైకొనదగి యున్నది. భాసుని నాటకములు రాజాజ్ఞచే దదాస్థానమున బ్రయోగింపబడుటకుగా వ్రాయబడినవి గావుననే యాతడు స్వీయనామనిర్దేశాదికమును జేయక పాత్రప్రవేశమును సూచించి స్థాపనలను మిగులజిన్నవిగ జేయుచు దుదను భరతవాక్యమునమాత్రము దనప్రభువును గీర్తించుచు వచ్చెనని తలంపదగియున్నది. కాళిదాసుకూడ నేదోయొక ప్రభువరుని యాస్థానము నలంకరించియే యుండెనని కొన్ని కథల మూలమున దెలియవచ్చుచుండినను, ఆతడు తన నాటకము లను రాజాజ్ఞచేగాని, తదాస్థానమున ప్రయోగింపవలయునను ప్రధానోద్దేశముతో గాని రచించినట్లు గనబడదు. ఏలయన, మాళవికాగ్నిమిత్ర నాటక ప్రయోగ సందర్భమున సూత్రధా రుడు పరిషదాజ్ఞచే నా నాటకమును ప్రయోగించు చున్నట్లుగా జెప్పుచున్నాడు:

''అభిహితోస్మి పరిషదా కాళిదాసగ్రథిత వస్తు మాళవి కాగ్నిమిత్రంనామ నాటకం అస్మి న్వసంతోత్సవే ప్రయోక్తవ్య మితి''

దీనివలన గాళిదా సీ నాటకమును సామాజికుల యానం దముకొఱకో, లేక, పండితుల పరితోషము కొఱకుగా (అపరితోషాద్విదుషాం న సాధు మన్యే ప్రయోగవిజ్ఞానం) రచించియుండును గాని కేవలము రాజాజ్ఞచే గాదనియు, నీతని కాలమున నిట్టి నాటకములు వసంతోత్సవము మొదలగు నుత్సవ స రకే ప్రబలియున్న నాటక సమాజములచే బహిరంగ ప్రదేశములయందు బండిత సభలయెదుట బ్రయోగింప బడుచుండెడివనియు దెలియవ చ్చుచున్నది. ఆ కాలమున నాటక ప్రయోగవిషయమునను,

దర్శన విషయముననుగూడ జనుల కమితోత్సాహముండె డిది. ఆయా యుత్సవసమయముల యందు నే భాసునిదో, సౌమిల్లునిదో, కవిపుత్రునిదో యేదో యొక నాటకము ప్రయోగింపబడుచుండుటయు, జను లత్యంతోత్సాహముతో నా నాటకములంజూడ నేగుచుండుటయు గలదు. మాళవికా గ్నిమిత్రము నానాడు చూడవచ్చిన పారిషద్యు లింతకుబూ ర్వము భాసాదుల నాటకముల జూచి యానందించుచున్నట్లు అందు బారిపార్శ్వికుడు సూత్రధారునితో జెప్పిన ''మాతా వత్ ప్రథిత యశసాం భాస సౌమిల్ల కవిపుత్రాదీనాం ప్రబంధా నతిక్రమ్య వర్తమానకవేః కాళిదాసస్య కథం పరిషదో బహు మానః'' అను పలుకులనుబట్టియే తెలియుచున్నది. జనులకు నాటకము లందును, దత్ప్రయోగములందును నభిమానము గలిగినవెంటనే యనేకులు నాటక కర్తలేకాక నాటకముల బ్రయోగించు సమాజములుగూడ పెక్కు బయలుదేఱుచుం డును. కాని సామాన్యముగా జనులకు బ్రాచీనకవుల యందును గవితయందును గల యభిమానము వర్తమానకవు లయందు లేకుండుట స్వాభావికమే. కావున నా కాలమునం దలి పారిషద్యులును భాసాదినాటకములయందువలె దక్కిన సమకాలికులగు వర్తమానకవుల నాటకములయందు దగిన యభిమానము జూపియుండకపోవుటచే నెట్లో కాళిదాసు కొందఱు స్నేహితుల సాహాయ్యముననో, నాటకప్రదర్శకుల తోడ్పాటు వలననో తన తొలిరచనను బ్రయోగింపజేసి, యప్పటి సామాజికులకుగల కేవల పురాణకావ్యాభిమానమును నవ్య కావ్యానాదరణమును ఖండించువాడుబోలె 'పురాణమి త్యేవ న సాధు సర్వం నచాపి కావ్యం నవమిత్యవద్యం' అని సూత్రధారముఖమున తన భావమును వెల్లడించి, భాసాదుల కావ్యములవంటి కావ్యములు వర్తమాన కవులలో గూడ ప్రతిభావంతులగువారు రచింపలేక పోరనియు, నంతకంటె రసవత్తరములగువానినే రచింపగలవారు కలర నియు సూచింపుచు బండితులగు సత్పురుషులైనను పరప్ర త్యయనేయబుద్ధులు గాక పురాణకావ్యమును దమ నవ్యకావ్య ములతో బోల్చిచూచి గుణవత్తరంబగు దానినిగ్రహింతురు గాక యని, ''సంతః పరీక్ష్యాన్యతమద్భజంతే మూఢః పరప్రత్యయనేయబుద్ధిః'' అని స్వపదస్థాపనకై యుద్ఘోషించి చెప్పుచున్న వానివలె గన్పడుచున్నాడు. ఇదివఱకు జనుల మనముల నాకర్షించియున్న భాసాదులనాటకముల బ్రచారము నణగ ద్రొక్కి యా స్థానమును వర్తమానకవియగు తా నాక్రమింప దలచినవాడు గావుననే యా ప్రస్తావనయం దీకవికి స్వీయగ్రంథ సమర్థనము, స్వనామనిర్దేశాదికము నవసరమై నవి. ఇట్లు కాళిదాసు ఆతని కాలపరిస్థితులనుబట్టి ప్రత్యేకపలా పేక్షచే చేసిన నామనిర్దేశాదిక మొక యాచారమై కాలక్రమమున నాటకరచనయం దొక నిబంధన మైనట్లున్నది.

''తత్ర పూర్వం పూర్వరంగః సభాపూజా తతఃపరమ్,
కథనం కవిసంజ్ఞాదేః నాటకస్యాప్యథాముఖమ్''

అని నాటకాదులయందు బూర్వరంగాదులు ముగిసిన పిమ్మట గవి నామగోత్రాదులను నాటక నామమును జెప్ప వలయునను సాహిత్యదర్పణకారాదుల లక్షణ వాక్యములకు గాళిదాసుని నాటకములే మూలలక్ష్యమై యుండనోవు. భాసుని నాటకముల యందువలె ''నాంద్యంతే తతః ప్రవిశతి సూత్రధారః'' అని నాంద్యంతమున సూత్రధార ప్రవేశము సూచింపబడక గాళిదాసుని నాటకములలో మొట్టమొదట నాందీశ్లోకము, పిదప ''నాంద్యంతే సూత్రధారః- అల మతివిస్త రేణ'' అని సూత్రధారుని వాక్యమును గన్పడుచుండుటచే నీ సూత్రధారుడే యా నాందీశ్లోకమును బ్రథమమున జదివి పిదప కవిని గూర్చియు, నాటకమును గూర్చియు బ్రస్తా వించు చున్నట్లు కనబడుచున్నది. దీనినిబట్టి కాళిదాసుని కాలమునకే

''పూర్వరంగం విధాయాదౌ సూత్రధారే వినిర్గతే,
ప్రవిశ్య తద్వ దపరః సూత్రధార గుణాకృతిః
సూచయే ద్వస్తుబీజం''

అను నాచారముగా మారినట్లు కన్పించుచున్నది. ''ఇదానీం పూర్వరంగస్య సమ్యక్ప్రయోగాభావాత్ ఏకఏవ సూత్రధారః సర్వం ప్రయోజయతీతి వ్యవహారః'' అను సాహిత్య దర్పణ కారుని వాక్యమందలి ''ఇదానీం'' అను వాక్యమున కర్థము కాళిదాసుని కాలమునుండియు నని గ్రహింపవలసి యుండు నేమో!

మొత్తము మీద నీ మాళవికాగ్నిమిత్ర మందలి సూత్రధార పారిపార్శ్వకుల సంభాషణమూలమున నాకాలమందలి నాటక ప్రయోగవిషయములగు పరిస్థితులనేకాక లబ్ధప్రతిష్ఠులగు భాసా దులతో గాళిదాసు పోటీకి నిలువబడుట కిదియే మొదల నియు, కావున నీనాటకమే యాతని ప్రథమ ప్రయత్నమ నియు గూడ మనము గ్రహింపవచ్చును. ఏలయన సూత్ర ధారు డా దినమున బూర్వమునందువలెగాక కాళిదాస గ్రథితవస్తువగు నవీననాటకము నొకదానిని బ్రయోగింప వలయుననగా బారిపార్శ్వకుడు భాసాదుల నాటకములను వదలి యీ యాధునికుని నాటకమునందు సభ్యుల కేమి యాదర ముండుననుట జూడగా నాదినమున సూత్రధారుడు తామాడబోవు నాటకమునే కాక నూతనముగా నాటకములను రచింప మొదలు పెట్టిన కాళిదాసునే సామాజికులకు బరిచితు నిగా జేయదలచినట్లు తెలియు చున్నది. కాళిదాసుని నాటకముల బ్రయోగించుట కిదియే మొదటిసారియని తెలియవచ్చుచుండుటచే నీ మాళవికాగ్నిమిత్రమే యితని

మొదటి నాటకమని మనము నిశ్చయింపవచ్చును. కవి యాధునికుడై యాతని కావ్యము గ్రొత్తదైనంత మాత్రమున నది గర్హ్యము కాదు. అది సత్పురుషుల కాదరపాత్రము కాకపోదు. వారు గుణవివేచన చేసి రసవత్తరమైనదానినే తప్పక గ్రహింతురు అని సూత్రధారుడు, లేదా సూత్రధార ముఖమున గాళిదాసు చెప్పిన సమాధానము పూర్వనాటకము లకంటె నిది రసవత్తరంబేయను నర్థమును ధ్వనింపజేయుచు న్నదివోలె నున్నది.

ఇక విక్రమోర్వశీయ ప్రదర్శన సమయమున గవి యిదివఱకే సామాజికులకు గొంత పరిచితుడగుటచే నాతని గూర్చి చెప్పవలసిన యవసరము లేకపోయినది. కావున సూత్రధారు డీసారి ప్రదర్శింపబోవు నాటకముయొక్క విశేషగుణములను బ్రశంసింప మొదలిడెను.

మారిషః– 'బహుశస్తు పరిషదా పూర్వేషాం కవీనాం దృష్టః ప్రయోగబన్ధః; సో హ మద్య కాళిదాస గ్రథిత వస్తునా విక్రమోర్వశీయం నామాపూర్వం నాటకం ప్రయోక్ష్యే.'

ఇదివఱలో సామాజికులు పూర్వకవుల నాటకములనేకములు చూచియుండిరి. (కాళిదాసుని మొదటినాటకమగు మాళవికాగ్నిమిత్రము కూడ నా పూర్వనాటక ఫక్కి ననుసరించినదే) కాని యిట్టి నాటకమును జూచియుండరు. అపూర్వతయే దీని విశేషగుణముగా దెల్పబడినది. మొదటిది పూర్వకవులగు భాసాదుల రచనలనే పోలియుండుటచే నీమాఱు కాళిదాసు నూతనఫక్కి ననుసరించి తన ప్రతిభను మెఱయింప సమకట్టెను. నాటకవస్తువుగా ఋగ్వేదమందును, మత్స్యవిష్ణుపురాణములందును బ్రఖ్యాతమగు విక్రమునికథను స్వీకరించెను. ఈ కథయు నగ్నిమిత్రునికథవలెనే నాయకుని యంతఃపురచర్యలనే విశేషముగ తెల్పునదియైనను, ఇందలి నాయకుని ప్రభావాతిశయము, దివ్యసంబంధము నీ నాటకమున దివ్యమర్త్యోభయాంశముల సమ్మేళనమునకు నద్భుతరసంబునకు గారణంబులై దీనికొక యపూర్వత నాపాదించినవి. కావుననే యిది వెనుకటినాటకము వంటిది కాదు; అపూర్వమైనది. ఇందలి సద్వస్తు పురుష బహుమానము చేతనైనను కాళిదాసుని యీ నాటకమును సావధానులరై చూచి యానందింపుడయ్యా యని సూత్రధారుడు,

''ప్రణయిషు వా దాక్షిణ్యా
దథవా సద్వస్తు పురుష బహుమానాత్,
శృణుత మనోభి రవహితైః
క్రియా మిమాం కాళిదాసస్య.''

అని యిట్లార్యమిశ్రులను హెచ్చరింపం దొడంగెను.

కాని యిందిట్టి హెచ్చరింపున కవసర మేమి యను ప్రశ్న కలుగక మానదు. ఇదివఱకు సూత్రధారుడు ప్రాచీన కవుల నాటకములం జూచి యానందించుచుండిన సామాజికుల యెదుట యీ నూత్నకవి ప్రథమకృతి యగు మాళవికాగ్నిమిత్రమును బ్రదర్శించుచు నందలి గుణములను గ్రహించు పనిని సదసద్వివేచనపరులగు పారిషద్యులకే వదలివేసెను. వారా ప్రయోగమును జూచి యానందభరితులయి యుందురు. ప్రాచీనకవుల ప్రతిభతో దులదూగు ప్రతిభాశాలి యీతడని తలంచియుందురు. ఇట్లా సామాజికులకు నీ నూత్నకవి యగు కాళిదాసునియందు గొంత ప్రణయ మేర్పడియుండును. కాని యీతడింకను లబ్ధప్రతిష్ఠుడు కాలేదు. కావుననే యీ మా ఱీతడు తన యప్రతిమానంబగు ప్రతిభావిశేషమును భావనాశక్తిని జూపుట కనువగు వస్తువు లేక యితివృత్తమును గ్రహించి పూర్వకవులను వెనుదన్న యత్నించెను. అందువలననే సూత్రధారు డీమాఱు ''ప్రఖ్యాతవస్తువుకలదై యుత్తమనాయకునితో గూడి కాళిదాసుని విశేషప్రజ్ఞను జాటెడి యీ యపూర్వ నాటకము నవహితచిత్తు లరయి చూడుడీ'' యని హెచ్చరించుట తటస్థించినది. భాస నాటకాదుల ఫక్కినే యనుసరించి రచించిన మాళవికాగ్ని మిత్రమువలెగాక కొంత వఱకు నూతనమార్గము ననుసరించి రచింపబడిన యీ విక్రమోర్వశీయముతో నీతడు ప్రకటితవిశేషప్రజ్ఞుడు లబ్ధప్రతిష్ఠుడు నయ్యెను. కావుననే శాకుంతల నాటకప్రయోగ సందర్భమున నానాటి సభ పండితులతో గూడినదైనను సూత్రధారున కెట్టి సంకోచములు, హెచ్చరింపులు, విజ్ఞాపనలు నవసరము లేకపోయినవి. ఇదివఱకు రెండు నాటకములు చూడవచ్చిన పారిషద్యులలో బండితులుండిరో లేరో తెలిసికొనుట కవకాశము కలుగలేదు. అనగా నా రెండు నాటకములచేతను తాను పండి తులను గూడ మెప్పింపగల నను నిశ్చయము కాళిదాసున కున్నదో లేదో మనమెఱుగము కాని యీ శాకుంతలనాటక ప్రయోగమును జూడవచ్చిన సభ పండితులతోడ గూడియున్నది. ''అభిరూపభూయిష్ఠా పరిషదియమ్'' అని చెప్పుచు అట్టి పండితమండలి యెదుటనుగూడ సంకోచమేమియును లేక ''కాళిదాసునిచే రచియింపబడిన యభిజ్ఞాన శాకుంతల మను నూతనమగు నాటక మిపుడు ప్రయోగింపవలసియున్నది.'' (అద్యఖలు కాళిదాస గ్రథితవస్తునా అభిజ్ఞానశాకుంతల నామధేయేన నవేన నాటకే నోపస్థాతవ్య మస్మాభిః'' అని సూత్రధారుడు పలుకుటచే నీ నాటక మెట్టి హెచ్చరింపులు లేకయే పండితుల మెప్పునుగూడ సులభముగ బడయగలదనుభావము సూచింపబడుచున్నది వోలె నున్నది. లేదా వెనుకటి రెండు నాటకముల మూలముననే కాళిదాసునికీర్తి నలుగడల వ్యాపించుటచే బండితప్రకాండు లనేకు లీతని నాటకమును

జూచి యానందించుటకు గుతూహలాయత్తచిత్తులై వచ్చి యుందురు భావమైనను దీనివలన వ్యక్తము కాకమానదు. ఇక విశేష మేమనగా నింతకు బూర్వము తాను ప్రయోగించు నాటకము యొక్క గుణములను దెల్పి సామాజికులను హెచ్చరించి నాటకమునం దాదరము గలిగింపజూచిన సూత్రధారుడి శాకుంతలమున, —

''ఆపరితోషా ద్విదుషాం
న సాధు మన్యే ప్రయోగవిజ్ఞానమ్,
బలవదపి శిక్షితానా
మాత్మ న్యప్రత్యయం చేతః.''

అని తన ప్రయోగవిజ్ఞాన విషయముననే సంశయగ్రస్త మనస్కుడయ్యెను. తగిన శిక్ష నందినను నుత్తమనాటక ప్రదర్శన విషయమున బ్రదర్శకులకు గొంత భయ ముండక పోదు కాబోలును. లేదా కొందఱు పాశ్చాత్యవిమర్శకులు చెప్పినట్లుగా నీ నాటకమందలి భావసౌకుమార్యము, రసోత్కర్షయు బ్రయోగమున కందనివై మిగుల సూక్ష్మములై (Too subtle to be represented on the stage) యుండెనను భావమున కిది సూచకమేమో? లేక, కాళిదాసునకే యిట్టి సంశయము నాపాదింపవచ్చునా? ఇదివఱకే లబ్ధప్రతిష్ఠుండై తన నాటక కళా ప్రావీణ్యము నంతను జూపి దీని నొక యుత్కృష్టమగు నాటకముగ రచియించితి నను నిశ్చయము కలవా డయ్యెను. పండితు లద్దానిం జూచి యౌనని తలయూపువఱకు గవి స్వీయగ్రంథప్రాశస్త్యమును గూర్చి సంశయ మనస్కుడు కాకమానడుగదా! ''బలవదపి శిక్షితానా మాత్మ న్యప్రత్యయం చేతః'' అను విషయము సర్వలోక సామాన్యము. వినయశీలుడగు కాళిదాసుకూడ దానికి లోబడియుండును.

ఇంతకు దేలిన దేమనగా బ్రప్రథమమున గాళిదాసు తనకు బూర్వమున బ్రసిద్ధిగాంచిన భాసాది నాటక కర్తల మార్గముననే యనుసరించి మాళవికాగ్నిమిత్రమను నాటకమును రచించి పిమ్మట పూర్వకవులకన్న దాను విశేష ప్రజ్ఞావంతు డనిపించుకొని లబ్ధప్రతిష్ఠు డగుటకు పై కథను బోలిన దానినే ప్రాచీనగాథలనుండి దీసి కథాసన్నివేశ విషయమున నెక్కుడు జాగరూకత వహించి విక్రమోర్వశీయమున వస్తువునకు గొంత యపూర్వత గలుగజేసెననియు బిదప దనకవితాశక్తియు లోకానుభవమును నాటకరచనా ప్రావీణ్యమును పరిపక్వావస్థ నొందుటచే, ప్రఖ్యాతేతివృత్తమునే గ్రహించి యున్నతాదర్శములతో గూడిన శాకుంతలమను నుత్తమనాటకంబును రచించెననియు స్పష్టమగుచున్న దనుటయే.

ఇక గథాచమత్కారము, పాత్రపోషణము, కావ్యకళా సౌందర్యము మొదలగువిషయముల నీ నాటకములకుగల తారతమ్యము, వీని గుణవివేచనమూలమున సువ్యక్తం బగుచున్న కాళిదాసుని ప్రతిభావిశేషము, తన్నాటక కళాపరిణామ మందలి యంతరావస్థలనుగూర్చి తెలిసికొనవలసి యున్నది.

పైజెప్పిన కారణములనుబట్టి కాళిదాసుని తొలిరచన యనదగియున్న మాళవికాగ్నిమిత్రమునందలి వస్తువు మాళవి కాగ్నిమిత్రుల ప్రణయ కథ. ఈ యగ్నిమిత్రుడు క్రీస్తునకు బూర్వము సుమారు నూటయేబది సంవత్సరములనాడు. మగధరాజ్యమేలిన శుంగ వంశమునకు మూలపురుషుడగు పుష్యమిత్రుని కుమారుడు. ఈతడు విదర్భ దేశరాజకన్యయగు మాళవికను వివాహమాడగోరగా నామె సోదరుడగు మాధవసేను డామెను దీసికొని య మిత్రుని పట్టణమునకు బ్రయాణమయ్యెను. అప్పుడు విద దేశము నేలుచున్న యజ్ఞసేనునకు నీతనికి దాయాదత్వపు ష ముండుటచే నీ వివాహమూలమున నీతనికి సహాయసంపత్తి కలుగ గలదని యెంచి మార్గమధ్యమున యజ్ఞసేనుడు మాధవసేనుని జెఱ బెట్టుటయు, నాతని విడిపించుటకుగా నగ్నిమిత్రుడు కొంత సైన్యమును బంపి విదర్భేశ్వరు నోడించుటయు, పిదప అగ్నిమిత్రుడు విదర్భయందు ద్వైరాజ్యమును స్థాపించుటయు మొదలగు రాజకీయ విషయములను బ్రాసంగికములుగను, ఇందలి ప్రణయకథ కాధార వస్తువుగను జేసి ముఖ్యముగ నగ్నిమిత్రుని యంతఃపుర చర్యలనే తెలుపుచు గాళిదాసు దీనిని గృహజీవితమును వర్ణించు నాటకముగనే (domestic drama) రచించినాడు. ఈతని నాటకరచనయందు బ్రథమ ప్రయత్న మిట్టిదగుటకు కారణ మాతడు తనకు బూర్వులగు కవుల మార్గ మనుసరింప దలచుటయేకాని వేఱు కానోపదు. షేక్స్పియరు మహాకవి ప్రథమమున మారో మొదలగు పూర్వకవుల పద్ధతులనే యనుసరించి కాలక్రమమున నాతని బుద్ధి పరిపక్వము బొందినకొలది రచనాపద్ధతి యందు స్వాతంత్ర్యమును వహించి స్వీయకళాచాతుర్యమును జూపి నట్లే కాళిదాసుడును మొదట పూర్వకవుల ననుకరించినను గాలక్రమమున బరిణత కళాసౌందర్యమును బ్రకటించి మెఱయించినాడు. ఈతడు మానవజీవితమందలి యసంఖ్యాకములగు దశావిశేషములను, మానవస్వభావ వైచిత్ర్యములను యథాస్థితంబుగ వర్ణించి షేక్స్పియరు మహాకవివలెనే వాఙ్మయాదర్శంబున విశ్వరూపిణియగు ప్రకృతియొక్క యనంతములగు రూపవైచిత్ర్యములను జూపకపోయినను హైందవప్రపంచమునకు బొడగట్టుచున్న యాదేవి పవిత్ర స్వరూపమును మాత్రము తన శాకున్తలము మూలమున సువ్యక్తం బగునట్లు చూపెననుటకు సందేహములేదు. హైందవ

ప్రపంచమున కాదర్శమగు నీ ధర్మస్వరూపమును గనుగొను టకు నాతనికి గొంతకాలము పట్టినది. మఱికొంత ప్రయత్నము, లోకానుభవము కావలసివచ్చినది.

ప్రథమమున గాళిదాసు భాసాదులనాటకముల బోలిన నాటకమునే యంతకంటె రసవత్తరంబుగ రచియించి సామాజికుల యాదరమును బడయుటకు యత్నించియుం డెను. భారత రామాయణకథ లింతకుబూర్వమే భాసాదులచే నాటకములుగా రచియింపబడియుండుట చేతనో లేక స్వభావముచేతనో అపరిచితవస్తుదశా (Romantic Situations) వర్ణనకౌతుకాయత్తచిత్తుడును, అద్భుత ప్రియుడు నగుటచేతనో, ఈతడా కథలను మొదట గైకొనదలంపలేదు. కాని మిగుల జనప్రీతి కరములై "ప్రాప్యావంతీ నుదయన కథా కోవిద గ్రామవృద్ధాన్" అని మేఘసందేశమున జెప్పబడినట్లుగా గ్రామాదులందుగూడ వ్యాప్తిజెందియుండిన ఉదయనుని కథలు నాటకరూపమున భాసరచితములై ప్రదర్శింపబడుచు జనానురంజకముగ వెలయుచుండుట జూచి తాను నట్టికథను నాటకముగ రచింపదలచి యాకాల మున దేశమున మిగుల వ్యాప్తిజెందియుండిన మాళవి కాగ్నిమిత్రుల ప్రణయకథను నాటకవస్తువునుగా గ్రహించెను. అగ్నిమిత్రుని యాస్థానముననేయుండి కాళిదాసీ నాటకమును రచించెననియు గొందఱు తలంతురు.

ఇట్లు భాసాదుల వాసవదత్తాదినాటకములే యీతని ప్రథమ ప్రయత్నమున మార్గదర్శకములైయున్నను, ఈతడు మాళవికాగ్ని మిత్రమున దన ప్రతిభావిశేషమును మెఱయింప కపోలేదు. అగ్నిమిత్రుడు వత్సరాజువలెనే రాజ్యభారమం తయు మంత్రుల కప్పగించి తా నంతఃపురమున గామచర్య లతో గాలము పుచ్చుచు వినోదించుచుండెను. సిద్ధాదేశము నందలి నమ్మకముచే పద్మావతీకరగ్రహణలాభము వత్స రాజ్యలాభమునకు గారణమగునని యౌగంధరాయణుడు లావాణకదాహాదిక కృత్రిమతంత్రములను బన్ని వాసవదత్తను బద్మావతియొద్ద నిక్షేపముగా నుంచెను. ఇందు మాధవ సేనుడు చెఱబెట్టబడుటచే నారణ్యకుల చేతులలో బడి తుదకు ధారిణియొద్ద చేరిన మాళవికను బరివ్రాజికావేషమున నచ్చట జేరిన పండితకౌశికి గుర్తించియు మాళవిక సంవత్సర కాలము ప్రేష్యభావము ననుభవించి పిదప దగిన వరుని బొందగల దనెడు సిద్ధాదేశమందలి నమ్మకముచేతనే తమసం గతి బయలు పఱుపక కాలము ప్రతీక్షించి యుండెను. ఇట్లు సిద్ధాదేశమే యీ రెండు నాటకములయందు గథాప్రవృత్తికి మూలకారణమైనది. కథానాయిక లీ రెండిటియందును గూడ నాయకుల యంతఃపురముల బ్రచ్ఛన్నముగనుండి రక్షింపబడుచు నాయకుని యనురాగాతిశయమునకు బాత్రలై విదూషకుని తంత్రముల మూలమున నాయకునితో రహస్యన మావేశముల బడయుచుండ దుదకు వీరు తమ పుట్టినింట నుండి పంపబడిన జనముచే గుర్తింపబడి నాయకునియొక్కయు, నాతని మహిషులయొక్కయు మన్ననలకు బాత్రము లగుచు వచ్చిరి. ఈ నాటకములో నాయకుని కామచర్యలే ప్రాధాన్యము వహించినను, ఈ ప్రణయకథారచనకు గొంత రాజకీయ వృత్తాంతము సముచిత సన్నివేశంబై యొప్పినది. మఱియు వాసవదత్తయందు గథాప్రవృత్తియంతయు యౌగన్ధ రాయణుని తంత్రము మీదనే నిలిచియున్నటులే మాళవికాగ్ని మిత్రమున విదూషకుని తంత్రములమీదనే యాధార పడియు న్నది. ఇక మాళవి కాగ్నిమిత్రమునందువలె దక్షిన నాటకములందు భాస నాటకానుకరణ మంతవిశేషముగ గన్పడకపోయినను వానియందు భానునిరచనాఛక్కి కొంత లేకపోలేదు.

ఈతని నాటకరాజంబగు శాకున్తలముననే పోలికలు గొన్ని గలవు. అభిషేకనాటకమున నాల్గవయంకమందలి,-

శ్లో. "యస్యాం న ప్రియమండనాపి మహిషీ
దేవస్య మండోదరీ
స్నేహో ల్లుంపతి పల్లవాన్ న చ పున
ర్వీజంతి యస్యాం భయాత్,
వీజంతో మలయానిలా అపి తరై
రస్పృష్టబాలద్రుమా
సేయం శక్రరిపో రశోకవనికా
భగ్నేతి విజ్ఞాప్యతామ్."

అను శ్లోకముతో భావసామ్యము రచనాసామ్యము గల

శ్లో. పాతుం న ప్రథమం వ్యవస్యతి జలం
యుష్మాత్స్వపీతేషు యా
నాదత్తే ప్రియమండనాపి సతతం
స్నేహేన యాపల్లవం,
ఆద్యే వః కుసుమప్రసూతిసమయే
యస్యాః భవత్యుత్సవః
సేయం యాతి శకున్తలా పతిగృహం
సర్వైరనుజ్ఞాయతామ్"

అను పద్యము శాకున్తలమున గానవచ్చు చున్నది.

శ్లో. "విస్రబ్ధం హరిణా శ్చరం త్యచకితా
దేశాగతప్రత్యయా
వృక్షాః పుష్పఫలైః సమృద్ధవిటపాః

సర్వే దయారక్షితాః,
భూయిష్ఠం కపిలాని గోకులధనా
న్యక్షేత్రవత్యో దిశో
నిస్సందిగ్ధమిదం తపోవన మయం
ధూమోపి బహ్వాశ్రయః.''
-స్వప్నవాసవదత్త.

శ్లో. ''నీవారా శ్శుకగర్భకోటరముఖ
భ్రష్టా స్తరూణా మధః
ప్రస్నిగ్ధాః క్వచిదింగుదీఫలభిద
స్సూచ్యంత ఏవోపలాః,
విశ్వాసోపగమా దభిన్నగతయః
శబ్దం సహంతే మృగా:
తోయాధారపథాశ్చ వల్కలశిఖా
నిష్యందరేఖాంకితాః''
-శాకున్తలమ్

''భోః కోనామ ఏతత్ జానాతి తాదృశే వయం అనర్థ సలిలావర్తే పునరున్మంక్ష్యామ ఇతి. ఇదానీం ప్రాసాదేషు ఉష్యతే, అంతఃపుర దీర్ఘికాసు స్నాయతే, ప్రకృతి మధుర సుకుమారాణి మోదక ఖాద్యాని ఖాద్యంత ఇత్యనప్సరస్సం వాసో ఉత్తరకురువాసో మయా అనుభూయతే. ఏకః ఖలు మహాన్ దోషః మమ ఆహారః సుష్ఠు న పరిణమతి. సుప్రచ్ఛద నాయాం శయ్యాయాం నిద్రాం న లభే.''
స్వప్నవాసవదత్త.

స్వప్నవాసవదత్త చతుర్థాంకమున నీ విదూషకుని వాక్య ములకును శాకున్తలమున ద్వితీయాంకమునందలి విదూష కుని వాక్యములకును గూడ జాల పోలిక గలదు..

ఇట్లే భవభూతినాటకములను శూద్రకుని మృచ్ఛకటిక మును భాసునినాటకములతో బోల్చి చూచినచో బ్రథితయశ స్కుడగు భాసునిరచనల ననుసరించిన దొక్క కాళిదాసే కాదని తెలియకపోదు.

అగ్నిమిత్రుడు స్వయముగా యుద్ధమునకైన బోక వీరసేనుని బొమ్మని జాబుమాత్రము వ్రాయించి తాను శృంగార విషయముల బ్రొద్దుపుచ్చుచున్నవాడగుటచే నతని పరాక్రమాది రాజపురుషలక్షణము లేవియు నెంత మాత్రము ప్రకటితములు కాలేదు. ఇక విక్రమోర్వశీయమందన్ననో, విక్రముడు కేశి యను రాక్షసునితో యుద్ధము చేసి యూర్వశిని రక్షించుటయు నింద్రునకు రాక్షసులతోడి యుద్ధమున నాతనికి దోడుపడుటయు నాతని పరాక్రమాదిగు ణములను వెల్లడించుచున్నవి. ఆతని పరాక్రమ ప్రదర్శనము నకు ప్రతిఫలమో యనునట్లు రాక్షసునినుండి రక్షింపబడిన దేవవేశ్యయగు ఊర్వశి యాతని సౌందర్య విలాసములచే మోహితయగుటయు, దుదకామె పాం దీతనికి గలుగుటయు సంభవించినది. మాళవికాగ్నిమిత్రమున నాయికానాయకుల యనురాగావిర్భావమునకు గారణ మగు ప్రథమసమావేశ మింతరమణీయముగ లేదు. ఇక శాకున్తలమున దుష్యన్తుని పరాక్రమాదిగుణ ప్రకటనమునకు విక్రమోర్వశీయమందు కేవలయాదృచ్ఛిక ప్రసంగమును కాళిదాసు గ్రహింపలేదు. కణ్వుని యాశ్రమమున యజ్ఞమునకు విఘ్నమాచరించుచున్న రాక్షసులను ధనుష్టంకారముల చేతనే పలాయితులను జేయుట చేతను, నింద్రునకు జయింపశక్యముకాని రాక్షసులను రూపు మాపి యాతని యర్ధాసన మధిష్ఠించి గౌరవింప బడుట చేతను, దుష్యంతుని పరాక్రమము విక్రముని పరాక్రమము కంటె సుప్రకాశిత మగుచున్నది. ఇంతియేకాక వేటయం దాసక్తి శ్రమాదుల నోర్చియుండుటకు వలయు సహనత్వాది కము, వీరపురుషులకు సహజమగు దృఢకాయమును గలిగి, యౌవన వంతుడు బలిష్ఠుడునగు నొక సుందర రాజపురుషుని యాకారము నీకవి మనయెదుట బెట్టుచున్నాడు. దుష్యంతుని వేటకై పురికొల్పినది కేవల మృగయాసక్తియే కాదు; వరాహశా ర్దూలాది దుష్టమృగ సంహారముచే దపోధనులగు నాశ్రమవా సుల సంరక్షణయు నీతని కవశ్యకర్తవ్యమై యున్నది. అనసూయ వాని నాతపోవనమునకు వచ్చుటకుగల కారణ మడుగగా ఋషుల తపస్సులు విఘ్నములులేక జరుగు చున్నవా లేవా యని విచారింప వచ్చితిని. ''ధర్మాధి కారే నియుక్తః అవిఘ్నక్రియోపలంభాయ ధర్మారణ్య మిద మాయాతః'' అని బదులు చెప్పెను. అరణ్యములందలి తాపసుల యోగక్షేమములవిషయమై యాతడు వహించిన విశేష శ్రద్ధకు నాఱవయంకమున గాశ్యపసందేశహారులగు ఋషికు మారుల యాగమన కారణమునుగూర్చి,-

శ్లో. కింతావద్వ్రతినా ముపోఢతపసాం
విఘ్నైస్తపోదూషితం
ధర్మారణ్యచరేషు కేనచి దుత
ప్రాణి ష్వసచ్చేష్టితమ్,
ఆహోస్విత్ప్రసవో మమా పచరితై
ర్విష్టంభితో వీరుధాం
ఇత్యారూఢబహుప్రతర్క్యమపరి
చ్ఛేదాకులం మే మనః''

అని వితర్కించుచు నాతడు పొందిన మనోవ్యాకులత్వమే నిదర్శన మగుచున్నది. రాజ్యమందలి ప్రజల నీతడెంత జాగరూకతతో స్వసంతానమువలెనే పరిపాలించుచున్నదియు

ధనమిత్రుని వృత్తాంతమువలన మనకు దేటపడుచున్నది. ఇట్లు ఇంద్రునకు జయింపశక్యముకాని రాక్షసులను జంపి దేవతలను, రాక్షసులను గ్రూరమృగములను సంహరించి యరణ్యములందు నివసించు తపోధనులను, స్వ సంతానము వలెనే రాజ్యమందలి ప్రజలను నొక్కరీతిగ రక్షించి పాలించు చుండుటచే వ్యక్తమగుచున్న యాతని పరాక్రమము, ఆర్తరక్ష ణపరాయణత్వము, ప్రజాహితైక జీవితత్వము, ధర్మరతి మొదలగు విశేషగుణములచే విక్రమాగ్నిమిత్రులకంటె నితడు హైందవ క్షాత్రధర్మమున కాదర్శభూతుడై వెలయుచున్నాడు.

ఈ నాటకత్రయమందు నాయకుల క్షత్త్రధర్మపరిపాలన విషయముననేకాక నాయికా నాయకుల ప్రణయవిషయమున గూడ గొంత భేదము కలదు. తన కంటబడకుండ దేవిచే రహస్యముగ రక్షింపబడుచుండిన యొక కన్యను మోహించిన వాడగుటచే నగ్నిమిత్రు డితరులకు దెలియకుండగ నా కన్యను దనకు గూర్చుటకుగా విదూషకు నభ్యర్థింపవలసిన వాడయ్యెను. ఈ నాయకుడు చిత్రగతయగు నాయికను జూచి మోహముకలవాడయ్యెనే కాని యాతని కామెను జేపట్టవచ్చునా యను సందేహమైన గలుగలేదు. విదూషకు డీ నాయికానాయకుల సమాగమము సమకూర్చినపుడెల్ల నిరావతి ప్రత్యక్షమగుచు వీరి విస్రంభభాషణములకు భంగము కలిగించుటయు, నీతడామెవలని భయముచే నేదోరీతి నొకబొంకు బొంకి యప్పటికి దప్పించుకొనుటయు దటస్థిం చుచువచ్చినది. ఇచ్చట నాయిక కేవలము పరతంత్ర యగుటయు, నామెను జేపట్టుటకు నాయకునకు స్వాతంత్ర్య ముగాని ధైర్యముగాని లేకుండుటయు, నీతని రహస్యతంత్ర ములను దేవి తెలిసికొని నాయిక నీతనికంట బడకుండ బంధించియు దుదకు లాభము లేదని యెంచి యామె నీతనికిచ్చి వివాహమొనర్చుటయు, నీనాటకమందలి నాయికా నాయకుల । ణయపద్ధతియై యున్నది. విక్రముడు గూడ నూర్వశిని మించి యామెతో గూడియుండుటకు దేవివలనిభయము లవాడై తనవిరహవేదన నామెకు దెలియ కుండ గప్పిపుచ్చినవాడేయైనను, నాతడు వలచిన స్త్రీ దేవియధీనమందు లేకుండుటచే నామెతోడి సమాగమమున కుగాను రహస్యతంత్రములను బన్నవలసిన యవసరము లేకపోయినది. ఇచ్చట దేవియు నీతని మనం బన్యాసక్తంబని గాలికి గొట్టుకొనివచ్చి తన చేతంబడిన యూర్వశీ లేఖాదు లచే నిశ్చయముగ దెలిసికొని రోషకషాయిత మనస్కయై విక్రముని యనునయంబులను లక్ష్యపెట్టక వదలించుకొని పోయినదైనను దుదకు బశ్చాత్తప్తయై ప్రియప్రసాదనవ్రత మను మిషచే మరల నాతని చెంతజేరి ''అద్యప్రభృతి ఆర్యపుత్రో యాం స్త్రియం కామయతే, యా ఆర్యపుత్రసమాగ మప్రణయినీ తయా సహాప్రతిబంధేన వర్తితవ్యమ్'' అని చెప్పిపోయినది. ఇట్లే దేవి తన కోపముచే నాతనిమనమును త్రిప్పలేకుండుటను దెలిసికొని తానే మఱియొక స్త్రీని ప్రేమించుట కాతని కనుమతి నిచ్చి మాట దక్కించుకొన్నది. రాజును నామె యెదుట ''నాహం పున స్తదా త్వయి యథాహి మాం శంకసే భీరు'' అని తా నన్యాసక్తమనస్కుడు కానట్లుగా జెప్పుకొనుచునే యామె తన చెంతనుండి మరలినతోడనే,-

''అపినామోర్వశీ;

శ్లో. గూఢం నూపురశబ్దమాత్రమపి మే
కాంతం శ్రుతౌ పాతయేత్,
పశ్చా దేత్య శనైః కరోత్పలవృతే
కుర్వీత వా లోచనే,
హర్మ్యేస్మిన్నవతీర్య సాధ్వసవశా
న్మందాయమానా బలా
దానీయేత పదాత్పదం చతురయా
సఖ్యా మమోపాంతికమ్.''

అని యూర్వశిరాక కూటలూరుచు గూరుచుండెను.

ఈ నాయికయు బరాధీన యగు కన్యగాని లేక తల్లి దండ్రుల యధీనమందుండిన యొకయువతిగాని కాక స్వైరిణి యగు దేవవేశ్య యగుటచే దనప్రియుని వెదకికొనుచు దానే వచ్చి యీ సమయము కనిపెట్టి వెనుకనుండి యాతని కన్నులు మూసినది. విక్రముడును దేవియెదుట చెప్పిన మాటలను ద్రోసిపుచ్చి తనప్రియురాలిని చల్లనిస్పర్శచే గుర్తించి ప్రియోక్తుల బల్కుచు నంతఃపురము జేర్చినాడు.

ఇక శకున్తలాదుష్యన్తుల ణయమందలి విశేషమేమనగా నది మొదటినుండియు ధ నిష్ఠంబేకాక ధర్మబద్ధంబునై యుండెను. కావుననే వీరియ రాగము హిందూ దాంపత్య మున కాదర్శభూతం బగుచున్నదని చెప్పదగియున్నది. పై రెండుకథలయందును గాళిదాసు నాయికా నాయకుల యను రాగ బంధముయొక్క పటిమను జూపినాడు. అచ్చట ధర్మచింతకే ప్రసక్తి కలుగ లేదు. ఈకథయందన్ననో యట్టి యనురాగము ధర్మబద్ధంబై దాంపత్యనిష్ఠ మగుచో నద్దానికి గలుగు పవిత్రతావిశేష మిట్టిదని వ్యక్తపఱిచినాడు. ధర్మ ప్రేరిత మగు నాత్మనిగ్రహ ప్రకటనమున కవకాశము కల్పించి యున్నాడు. కావుననే యింద్రియలోలత్వమునకు జిక్కి రాజ్యభారమునుగూడ వహింప నిచ్చగింపని నాయకులతో గూడిన తక్కిన నాటకములకంటె నీ శాకున్తలమే కాళిదాసుని బుద్ధిపరిపాకముయొక్క యౌన్నత్యమును సూచించుచున్న

దని చెప్పదగి యున్నది. ఆశ్రమవృక్షములకు జెలులతో గూడి నీరువోయుచున్న శకున్తల యవ్యాజమనోహరంబగు శరీరంబును, దల్లావణ్యాదికమును జూచినతోడనే దుష్యన్తుని మనమున నొకవిధమగు నభిలాష పొడమినది. వెంటనే, కణ్వాశ్రమమున నున్నట్టియు నా మహర్షి కుమార్తెయని చెప్పబడినట్టియు నీమె బ్రాహ్మణ కన్యయే యై యుండవ లయు గావున క్షత్రియుడగు తనకు బరిగ్రహణయోగ్య గాదని తలంచి యాతడు తనమనోవృత్తి నడ్డగించెను. కాని యార్యంబగు తన మనం బామెయం దభిలాష గలదగుటచే నామె తప్పక క్షత్రపరిగ్రహ యోగ్యయే కావచ్చునని తన యంతఃకరణ ప్రవృత్తిని బట్టి నిశ్చయించెను.

శ్లో. ''అసంశయం క్షత్రపరిగ్రహక్షమా
యదార్య మస్యా మభిలాషి మే మనః,
సతాంహి సందేహపదేషు వస్తుషు
ప్రమాణ మన్తఃకరణ ప్రవృత్తయః.''

పిమ్మట నామె జన్మ వృత్తాన్తమును, ఆజన్మాంతము నీమె బ్రహ్మచర్యవ్రతము జరుపవలసినదో లేక యనురూప వర ప్రదానమున గణ్వున కిష్టముకలదో యను విషయము నాత డీమె చెలికత్తె నడిగి తెలిసికొనెను. అట్లు తెలిసికొనిన పిమ్మటనే తన మనంబు నామెపై లగ్నముచేసెను. తన హృదయ ప్రార్థనము వ్యర్థము కాదని నిశ్చయించుకొనెను. శకున్తలయు నాతని జూచినప్పటినుండియు 'నేమి? నా మన మాశ్రమవాసమునకు విరుద్ధమగు వికారమునకు లోనగుచు న్నది.' ''కింను ఖల్విమం ప్రేక్ష్య తపోవన విరోధినో వికారస్య గమనీయాస్మి సంవృత్తా'' అని సాశ్చర్యముగ వితర్కించుకొన సాగినది. రాజు నెదుట తన చెలికత్తెలు తన వివాహ విషయము ముచ్చటింపగా దాను పోయి వీరి యసంబద్ధ ప్రలాపములను గౌతమి కెఱింగించెద నని బెదరించి పోబోయినది. తాను విరహానలతప్తయై శైత్యోపచారముల నపేక్షించుచున్నను ''హలా! కి మన్తఃపుర విరహ పర్యుత్సుకస్య రాజర్షే రుపరో ధేన'' అని యాతని హృదయమును శోధింప జొచ్చినది. రాజునొద్ద నేకాంతముగ విడచిపోయిన చెలుల ననుగమింప నుద్యమించుచున్న యామెను దుష్యన్తుడు నిరోధింప ''పౌరవ! రక్ష వినయం, మదనసంతప్తాపి న ఖ ల్వాత్మనః ప్రభవామి-'' అని యాతని నివారింపుచు తాను దనతండ్రి యధీనములోనున్న దగుటచే నాతని యనుమతి లేకయే స్వతంత్రించుట కొప్పుకొనలేదు. తుదకు రా జామెకు బూర్వ గాథలను దెలిపి క్షత్రియ కన్యలకు స్వయంవర స్వాతంత్ర్యమున్నదని నచ్చజెప్పి గాంధర్వ వివాహమున కొడంబఱచెను. ఈ వివాహము వీరి యనురూప దాంపత్య మును గూడ కణ్వమహాముని సమ్మతిని బడయుటయే గాక యాతని యాశీర్వాదమును గూడ బొందినవి. పిదప గణ్వుడే యామెను భర్తయగు దుష్యన్తుని యొద్దకు బంపుటకు గౌతమితోడను మఱియిద్దఱు శిష్యులతోడను బ్రయాణము చేయించెను. కాని యామె యూర్వశి వలె గురుశాపహతయై యథోలోకమున దన నాయకునితోగూడి యుండుటకుగా ముక్తాభరణ భూషితయై నీలాంశుక పరిగ్రహముకల యభిసా రికా వేషమును ధరించి సంధానకర్త్రియగు చెలికత్తియతోగూడి బయలు దేఱలేదు. శకున్తలా ప్రయాణ సమయమున బరిశుద్ధంబగు నా యాశ్రమమున నామె పవిత్ర జీవితమునకు దగినట్లుగా కణ్వమహాముని ప్రభావాతిశయంబున —

శ్లో. ''క్షౌమం కేనచి దిందుపాణ్డు తరుణా,
మాఙ్గల్య మావిష్కృతం
నిష్ఠ్యూత శ్చరణోపభోగసుభగో
లాక్షారసః కేనచిత్,
అన్యేభ్యో వనదేవతాకరతలై
రాపర్వ భాగోత్థి తైః
దత్తా న్యాభరణాని తత్కిసలయో
చ్ఛేదప్రతిద్వంద్విభిః.''

ఒక వృక్షము పట్టుబట్ట నిచ్చినది; మఱియొకటి చరణముల కలంకరించుకొనుటకు మాంగల్య సూచకమగు పారాణి నిచ్చినది. ప్రస్తుతమున నీకాలమున బ్రబలుచున్న నవనాగర కత యిప్పటి తెల్లని మల్లుపంచెలును అంతకంటె స్వచ్ఛతరం బులగు జనుల మనంబులును రాగయుక్తంబులై పోవునని కాబోలును యీ లాక్షారసలేపనమును దూరాపాస్తముగా జేయందొడగినట్లున్నను, కాళిదాసు కాలము నుండియు నిది మాంగళ్య సూచకముగనే యెంచబడుచుండుటచే నీ యాచా రము సుమారు రెండువేల యేండ్లనుండి వచ్చుచున్నట్లు మనకు దెలియవచ్చుచున్నది. ఇట్టి వన దేవతా దత్తంబులగు మఙ్గళ వస్తువులను ధరించి ఋషి కుమారులచే ననుగమ్యమా నయై కాశ్యపునిచే నత్తవారింటికి నంపబడుచున్న శకున్తలను, పై జెప్పబడిన రీతి నభిసారికావేషము గ్రహించి సహచరీసహా యయై ప్రియుని వెదకబోవుచున్న యూర్వశిని మన మనోముకురంబున బ్రతిఫలింపజేసి చూచినచో నే నాయిక హైందవ ధర్మంబుల కాదర్శభూతం బగుచున్నదో యే చిత్రము కాళిదాసుని పరిణతబుద్ధిచే జిత్రింపబడియుండునో మనము సులభముగా గ్రహింపగలుగుదుము.

కాళిదాసుని నాటక కళ పరిపక్వము నొందిన కొలది యాతని నాటకముల విదూషకుని చర్యలు నాతడు నాయకుని కామతంత్రమున జేసిన సాహాయ్యమును తగ్గిపోవుచుండుటే కాక నాయకుల ప్రణయతంత్రములకు వీరి పెద్ద భార్య

లౌనర్చెడి భంగపాటును తగ్గుచు వచ్చెనని చెప్పదగియున్నది. అగ్నిమిత్రునివలె విక్రమునకు బ్రియానమాగము విషయమున నంతగా విదూషకుని మీద నాధారపడవలసిన యవసరము లేకపోయినది. ఇక శాకున్తలము నందు విదూషకుడు నాయికా నాయకుల సమాగమమున కెట్టి సహకారియు గాలేదు సరిగదా! దుష్యంతుడు తన ప్రణయకార్యము నాతని యపేక్ష లేకయే నిర్వర్తించుకొనవలసిన వాడయ్యెను. విదూషకుని కీ ప్రణయ వ్యాపారమున బ్రసక్తి లేకుండ జేయుట చేతనే యాతడు కథాప్రవృత్తికి (development of the plot) తోడ్పడునట్లీ మహాకవి యిం దేర్పఱచినాడు. మఱియు నిందు దేవియగు వసుమతి యంగులీయకము దొరికినది మొదలు రాజునకుగలిగిన యన్యస్థతను విని శంకితమనస్కుయై యుండి చతురిక రాజుకై తీసికొని పోవుచున్న వన్నెల పెట్టెను దానే తీసుకొని పోయి యిచ్చెదనని బలవంతముగా లాగికొని రాజు చర్యలను గనిపెట్టవలెనని బయలుదేఱినదైనను, ప్రతీహారి చేతనొక కాగితము బట్టుకొని రాజునొద్దకు బోవుచుండుటను జూచి రాజకార్యమునకు భంగము కలుగునేమో యనుభయముచే వెనుకకు మఱలి పోయినది. ఇది వసుమతి సమయజ్ఞతనే కాక దుష్యంతునకు రాజధర్మ నిర్వర్తన మందుగల విశేషాదరమును గూడ సూచించుచున్నది. ఇట్లీ నాటకమున దేవి నాయకుని ప్రణయ కార్యములకు గలిగించిన భంగ మేమియు లేకపోగా నాయకుడును నామెకు భయపడి బొంకవలసిన యావశ్యకతయు లేకపోయినది. ఇట్లీశకున్తలా దుష్యంతుల ప్రణయ కథ తక్కిన రెండు కథల కంటె నున్నతాదర్శంబుల నెలకొల్పుచు గాళిదాసుని బుద్ధివికాసము యొక్క పరిపూర్ణతకు దార్కాణంబగుచున్నది.

ఇక నీ శాకుంతల మందే యాతని కళాచాతుర్యము గూడ పరిపూర్ణతను బొందెననుటకు నొకటి రెండు నిదర్శనములు చాలును. మాళవికాగ్నిమిత్రమున గథాప్రవృత్తి యంతయు జాలవఱకు విదూషకునిమీదనే యాధారపడినట్లు కన్పట్టక మానదు. అగ్నిమిత్రుడు చిత్రగతయగు మాళవికను జూచిన దాది దేవి యనుగ్రహముచే నామెను చేపట్టు వఱకు విదూషకుడు పన్నిన పన్నుగడల కనుకూలంబుగ నడమకొనుచు నాతడు త్రిప్పినట్లెల్ల దిరుగుచు వచ్చెను. విక్రమోర్వశీయమున గథయంతయు నొకడు త్రిప్పినట్లు తిరుగకుండుటయేకాక యందలి కథాసంధులు పై దానిలోని వానికంటె విశేష నైపుణ్యముతో నమర్పబడి యున్నవి. విక్రము డూర్వశిని రక్షించుటచే నింద్రుని బహుమానమునకు బాత్రుడయ్యెను. ఈ సందర్భమున నూర్వశికి విక్రముని యందు గలిగిన యనురాగము భరతముని శాపమునకు గారణముగాగ నింద్రునికి విక్రముని యందు కలిగిన యాదరమే పై శాపమునకు ఊర్వశీ విక్రముల మనోరథ సిద్ధికి గారణ మగునట్లు మార్చి వేసినది. మఱియొక విశేష మేమనగా నీ శాపమునందే, లేక శాపావధియందే యుత్తరకథకు వలయు బీజము లిమిడియున్నవి. ఎట్లనగా నీ శాపావధిని గూర్చిన జ్ఞానమే యూర్వశి తన కుమారుని చ్యవనఋష్యాశ్రమమున విడచివచ్చుటకు హేతువై పంచమాంకమున యాయువును గూర్చిన కథకు దారి తీసినది. మొత్తముమీద నీ కథాచక్రమంతయు తరువాతి శాకుంతల మందువలెనే యొక శాపమను కీలునందు దిరుగుచున్నదని చెప్పవలసి యున్నది.

శాకున్తలమున గణ్వమహాముని శకున్తలా ప్రతికూల దైవమును శమింప జేయుటకుగా సోమతీర్థమునకుబోదలచి పర్ణశాలయం దామె నతిథిసపర్యకై నియోగించి వెళ్ళుటయే నాయికానాయకుల సమాగమమునకు వారి పరస్పరానురాగమునకునేకాక తన్మూలమున దుర్వాసుని శాపమునకుగూడ మార్గము నేర్పఱచియే పెట్టినది. ఋష్యాశ్రమములయందు నతిథి సత్కారములకుగల ప్రాముఖ్యము, దుర్వాసునికిగల ముక్కోపితనము, కణ్వునిచే నాశ్రమమున నతిథి సత్కారమునకుగా నియమితయయ్యును ననురాగవిష్టచిత్త యగు శకుంతల తన ధర్మము పట్ల నలసత్వము వహించుటయు నివి యన్నియు శాపమున కనువగు పరిస్థితులను గల్పించినవి. ఈ శాపకీలక మీ కథా చక్రముననేకాక నాటక చక్రమునకు నట్టనడుమనే (అనగా నేడంకములు గల యీ నాటకమున నాల్గవ యంకము మొదటనే) యమర్చి యీ మహాకవి కథాచక్ర మెంత రమ్యముగనో త్రిప్పియున్నాడు! అయిదంకముల విక్రమోర్వశీయమునను మూడవ యంకమున నట్టనడుమనే పొందుపఱుపబడినది. దీనియందు గథా ప్రవృత్తి మాత్రమునకే తోడుపడిన యీ శాపము శాకుంతలమున బాత్రపోషణమునకును రసోత్కర్షకును గూడ సాహాయ్యమును జేసినది. లోకమున వ్యాసుని దుష్యంతునకు (ననగా భారతమందలి దుష్యంతునకు) వచ్చిన నిందను దొలగించి యిందలి నాయకుని ధీరోదాత్త లక్షణ సమన్వితుడగు నుత్తమనాయకునిగా జేయుటకుగాను గాళిదాసీశాపసాహాయ్యమును గొనినవాడయ్యెను. దుర్వాసుడు శకుంతలకు నిచ్చిన శాపము దుష్యంతునియందు సంక్రమించి పూర్వగాథా విస్మృతి రూపమున బరిణమించినది. శాపహతుడగుటచే శకుంతల యెడ గావించిన యన్యాయమువలన నీతడు గళంకితుడు కాలేదు. ఇట్లు శాపము నాయకుని స్వభావమును బోషించి సమర్థించుచుండ శాపవిమోచన కారణము గథాప్రవృత్తికి దోడ్పడుచున్నది. ఈ కారణ మభిజ్ఞానాంగుళీయకము.

శకున్తల భర్తృగృహమునకు బోవునపు డామె చెలికత్తెలు శాపవృత్తాంతము చెప్పినచో నామె దుఃఖించుననియో లేక తచ్ఛాపపరిహార కారణం బగు నంగుళీయకమునే భద్రముగా నామెకిచ్చుచున్నపుడు మరల శాపవృత్తాంత ప్రసంగ మనవస రమనియో తలంచి యేమియు జెప్పక భర్త తన్ను గుర్తింపనిచో నీ యంగుళీయకమును జూపుమని యిచ్చిరి.

''యది నామ రాజా ప్రత్యభిజ్ఞామంథరో భవేత్ తదా ఏతదంగుళీయకం దర్శయ.''

కాని విధివశమున నీమె యంగరమును గోల్పోవుటయు నద్దాని గుర్తింపకుండుటయు నిందలి నాయికా నాయకుల వియోగమునకు గారణమై కథాప్రవృత్తికి దోడ్పడుచు రాజు ధర్మశీలత్వమును వెల్లడించినది. ఈ యభిజ్ఞానాంగుళీయ కమే మరల ధీవరుని మూలమున దుష్యంతుని చేతబడినదై శకుంతలాపరిణయ గాథ నాతని స్మృతి పథమునకు దెచ్చి యీ నాటకమున విప్రలంభ శృంగారరసము నుద్వేలము గావించుటకు దోడ్పడినది. మఱియు నీ యభిజ్ఞాన దర్శనమైన పిమ్మట పశ్చాత్తాపదోదూయమానమానసుడగు నాయకునకును, భర్తచే దిరస్కృతయైనను పతిదైవతయేయై ''పరిధూసరిత వస్త్రయు, నియమక్షామముఖియు, నేకవేణి యునై విరహవ్రతమును భరించుచున్న'' నాయికకును మిగుల పవిత్రమును బుణ్యవంతమునై యూర్ధ్వలోకమున నున్న మారీచాశ్రమముననే పునస్సమాగమమును గల్పించి కవి యీ కథా నిర్వహణము నతి హృదయంగమముగ చేసి యద్భుతరసావిష్కరణమును గూడ సాధించినాడు.

విక్రమోర్వశీయ మందలి కథా నిర్వహణము నద్భుత జనకంబేయైనను నింత యున్నత పవిత్ర భావోత్తేజకంబుగ గన్పడదు. కాని వీరి సమాగమమునకు శాకుంతలము నందు వలెనే వీరి కుమారుడే సన్నిహిత కారణమయ్యెను. ఈ కుమారుల సత్త్వోత్కర్షము వారి క్రీడాదికము చేతనే స్పష్టమగుచున్నది. కాని సర్వదమనుని కంటె నాయువు పెద్దవాడగుటచే నీతని బాల్యచేష్టల కంటె భక్తిభావమే మన మనముల నెక్కుడుగ నాకర్షింపగలదు. సర్వదమనుడన్ననో తన బాల్యచేష్టలచేతను అవ్యక్తమధురములగు ముద్దుమాటల చేతను, వాత్సల్య భావోత్కర్షకు గారకుడై యచ్చట దుష్యంతుని హృదయముతోపాటు మన హృదయములగూడ కఱగించి వేయుచున్నాడు.

కావున నిట్లు పరిశీలించి చూడగ నీ మహాకవి కాళిదాసు మాళవికాగ్నిమిత్ర రచనచే పూర్వకవుల మార్గమునే యనుస రించి నాటకకళయందు గొంత యభ్యాసము జేసికొని పిదప విక్రమోర్వశీయమున గొంత యపూర్వత గనబడునట్లుచేసి తన ప్రతిభను సూచించుచు నందు దన్మూలమున నుత్తమ నాటకమునకు వలయు పరికరమునంతను గూర్చి పెట్టుకొని వానినే మరల దీసికొని శాకుంతల కథయం దమర్చి దిద్ది వంకలుదీర్చి సానపెట్టి మెఱుగుతోమి తుదకు దానిని సంపూర్ణ ప్రభాభాసమానంబగున ట్లొనర్చినాడా యని తలంప దగి యున్నది.

సత్యం వద! ధర్మం చర!

— Upanishad

Truth alone triumphs, but not falsehood

— Sivananda

సత్యమేవ జయతే, నానృతమ్

— (శ్రీ 'కోరాడ' వారి డైరీనుంచి)